ప్రజాశక్తి

జాయింట్ కలెక్టర్‌గా భావన

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా భావన నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అమరావతిలో ఆమె విలేజ్ వార్డ్ సెక్రటేరియట్‌లో అదనపు కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. బదిలీపై ఆమె అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ జాయింట్ కలెక్టర్‌గా పని చేసిన కార్తీక్ విజయనగరం జాయింట్ కలెక్టర్ గా బదిలీ అయ్యారు. కొన్ని రోజుల క్రితమే కార్తీక్ అల్లూరి జిల్లా జెసిగానియమితులై వెంటనే మళ్లీ బదిలీ అయ్యారు.

ప్రయాణం..ప్రమాదభరితం...

▶▶ మరమ్మతుకు నోచని రహదారులు
▶▶ పట్టించుకోని అధికారులు, నాయకులు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

జిల్లాలోని పలు చోట్ల రహదారులు ప్రమాదభరితంగా మారాయి. పాడేరు మండలంలో రహదారుల అంచులు దెబ్బతినడంతో వాహనారులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. డుంబ్రిగుడ మండలంలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

పాడేరు టౌన్:అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు నుంచి పెదబయలు, ముంచింగిపుట్టు మీదుగా జోలపుట్టు వరకు సుమారు 70 కిలోమీటర్ల తారు రోడ్డు ఉంది. రోడ్డు వేసేటప్పుడు రహదారికి ఇరువైపులా రోడ్డు బాగా ఎత్తుగా ఉన్నచోట అంచుల వద్ద రాతిపేర్పు చేసి, మట్టి పోసి రోలింగ్ చేయాలి. వర్షపునీరు రహదారులపై నుంచి ప్రవహించకుండా తగిన చర్యలు చేపట్టాలి. కానీ రోడ్డు నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్లు, అధికారులు వీటి గురించి పెద్దగా పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

శిథిలావస్థలో ఉన్న అడపవలస రోడ్డు

ముంచింగిపుట్టు మండల కేంద్రంలో ప్రతి శనివారం, పెదబయలు మండల కేంద్రంలో ప్రతి సోమవారం, పాడేరు మండలం సంతబయలులో ప్రతి గురువారం నిర్వహించే వారపు సంతలకు వ్యాపారులు, వినియోగదారులు అధిక సంఖ్యలో ఇదే రహదారిలో రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా ముంచింగిపుట్టు, పెదబయలు మండలాలకు చెందిన ప్రజలు జిల్లా కేంద్రానికి ఆయా పనుల నిమిత్తం నిత్యం వచ్చి వెళుతుంటారు. పాడేరు నుండి వెళ్లే చింతలవీధి, గబ్బంగి, గుత్తులపుట్టు, మఠం తదితర ప్రాంతాల్లో రహదారులకు రెండు వైపులా అంచులు వర్షపు నీటితో కోతకు గురై గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా ప్రమాదానికి గురికాక తప్పదు. రాత్రిపూట ప్రయాణాలు మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. ప్రతి సంవత్సరం వర్షాలకు మట్టి క్రమంగా కొట్టుకుపోతూ ప్రమాదకరంగా పరిణమిస్తోంది. వర్షాలు పడ్డప్పుడల్లా వాహనాల రాకపోకలకు మరింత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పుకునే సమయంలో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని వాహన చోదకులు చెబుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి కోతకు గురైన రోడ్డు అంచుల వద్ద రాతిపేర్పు చేపట్టి, మట్టి పోసి రోలింగ్ పనులు చేపట్టాలని పాడేరు, పెదబయలు, ముంచింగిపుట్టు మండలాల ఆయా పంచాయితీల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అడప వలస రోడ్డు అస్తవ్యస్తం

డుంబ్రిగుడ: మండలంలోని జైపూర్ జంక్షన్ నుండి ఆడప వలస వరకు ఉన్న రోడ్డు పూర్తిగా శిథిలవస్థలో చేరింది. గుంతలు ఏర్పడటంతో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో ప్రయాణించే ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. ఒడిస్సాకు ప్రధాన రహదారి కావడంతో అధిక సంఖ్యలో వాహనాలు ప్రయాణం సాగిస్తున్నాయి. వర్షాకాలంలో గుంతల్లో నీళ్లు నిల్వ ఉండి పోతుండడంతో ఆ సమయంలో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మరమ్మత్తు చేపట్టాలని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు అంటున్నారు.

వెంటనే మరమ్మత్తు చేపట్టాలి:

శిధిలావస్థలో చేరి ప్రమాదకరంగానున్న అడప వలస రోడ్డును తక్షణమే మరమ్మత్తు చేపట్టాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదకరంగా ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటు న్నాయని చెప్పారు. గోతులమయంగా ఉండటంతో ఇబ్బంది పడాల్సి వస్తుందని తెలిపారు. వెంటనే మరమ్మత్తు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పాడేరు మండలం చింతలవీధి వద్ద కోతకు గురైన రోడ్డు అంచులు

స్ఫూర్తిదాయకం..అంగన్వాడీల పోరాటం

విజయోత్సవ సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

కేకు కట్ చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: తమ డిమాండ్ల సాధనకు ప్రభుత్వంతో అంగన్వాడీలు చేసిన పోరాటం స్ఫూర్తిమంతమని, అందులో విజయం సాధించడం అభినందనీయమని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ అన్నారు. ఆదివారం ఆదివారం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి కె వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో విజయోత్సవ సభ నిర్వహించారు. అంగన్వాడీల 42 రోజుల నిరవధిక సమ్మెలో వివిధ రూపాల్లో చేసిన ఆందోళనకు రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన నేపథ్యంలో విజయానికి గుర్తుగా తొలుత కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ, అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ప్రాణాలొడ్డి పోరాటం చేశారని, గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో తమ ప్రాణాలను ఫణంగా తమ ఉద్యమంతో రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేశారన్నారు. ఐక్యంగా పోరాడితో ఎటువంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని, అంగనవాడీల ఐక్య పోరాటం దీన్ని నిరూపించిందన్నారు.

అంగన్వాడీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నిర్మల మాట్లాడుతూ, తమ హక్కులు, డిమాండ్ల సాధనకు ఐక్యంగా కదిలిన అంగన్వాడీలకు ఉద్యమ అభినందనలు తెలిపారు, అంగన్వాడీల సమ్మెకు మద్దతు ఇచ్చిన సిఐటియు, ఆదివాసీ గిరిజన సంఘం, ఇతర ప్రజా సంఘాలు, భవన నిర్మాణ కార్మికులకు, అంగన్వాడీ లబ్ధిదారులకు,ప్రజలకు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ, సమస్యలను పరిష్కరించకుంటే తమ సత్తా చూడాలంటూ అంగన్వాడీల హెచ్చరిక నినాదాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కుదిపేలా చేశాయన్నారు. అంగన్వాడీల సమ్మెకు ఉద్యోగ ఉపాధ్యాయ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ రంగాల్లో పనిచేసే ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలపడం సమైక్య స్ఫూర్తికి నిదర్శనమన్నారు. ఇంతటి గొప్ప విజయాన్ని సాధించిన అంగన్వాడీలకు ఉద్యమ అభినందనలు తెలిపారు, అనంతరం అంగన్వాడీలు కార్మిక సంఘాల పాటలకు లయబద్ధంగా నృత్యాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు, కె శాంతిరాజు, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షరాలు చిన్ని కుమారి, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి టి శ్రీనివాస్, యూనియన్ నాయకులు రమణి, రాధ, సుందరమ్మ, రమణ,మంగయమ్మ, రమణి, పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

మన్యంలో మెరిసిన ముత్యం

ఎన్ఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా గిరిజన యువకుడు
అభినందించిన సిపిఎం, కాంగ్రెస్ నేతలు, స్థానికులు

మోహన్‌ను అభినందిస్తున్న నేతలు, స్థానికులు

ప్రజాశక్తి- కూనవరం :మండలంలోని గొమ్ము అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన కర్నాటి శ్రీనివాసరావు కుమారుడు కర్నాటి మోహన్‌కు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయపూర్ ఎన్ఐటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం రావడం, విధుల్లో చేరడంపై స్థానికంగా హర్షం వ్యక్తమౌతోంది. మారుమూల గిరిజన రైతు గ్రామంలో పుట్టి, ఉన్నత చదువులు చదివి. ప్రతిష్టాత్మక రాయపూర్ ఎన్ఐటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం దక్కడంపై సిపిఎం, కాంగ్రెస్ నేతలతోపాటు పలువురు అభినందించారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు మాట్లాడుతూ, కృషి, పట్టుదలతో చదివి, దానికి ప్రతిఫలంగా మంచి ఉద్యోగం పొందడంపై మోహన్‌ను అభినందించారు. మోహన్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, సీనియర్ నాయకులు తలగాని నాగరాజు, షణ్ముకేశ్వరావు, నోముల సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీమంతుల వెంకటరమణ, సతీష్, స్థానిక ఎంపిటిసి జయ సుధ, సర్పంచ్ బొగ్గా రామారావు, సుబ్బయ్య, బాబూరావు పాల్గొన్నారు.

పాడేరులో ఉదయం 8 గంటల సమయంలో పొగమంచు

మన్యంలో దట్టంగా పొగ మంచు

- ఉదయం 10 గంటల వరకూ కనిపించని భానుడు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత తగ్గడం లేదు. ఉదయం 9 గంటల వరకు పాడేరు, చింతపల్లి, అరకులోయ ప్రాంతాలలో పొగ మంచు దట్టంగా కురుస్తోంది. 10 గంటల వరకు భానుడు కనిపించడం లేదు.

పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీ బోర్డు వద్ద, జిల్లా కేంద్రం పాడేరులో 13.8, చింతపల్లిలో 12.8, అనంతగిరి 13.4, పెదబయలు 13, హుకుంపేట 14.6, అరకు 12.8, జికె వీధి 11.6, జి.మాడుగుల 8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నెలకొంది. పొగ మంచు అధికంగా ఉండటంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహన చోదకులు లైట్లు వేసుకుని వాహనాలు నడుపుతున్నారు. రాత్రి వేళల్లో చలి తీవ్రత అధికంగా ఉంది. దీంతో, మన్యం వాసులు మంటలు తాగుతూ, ఉన్ని దుస్తులు ధరిస్తూ చలి నుంచి రక్షణ పొందుతున్నారు. వ్యవసాయ పనులు, వారపు సంతలకు వెళ్లే గిరిజనులు పొగ మంచుతో ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాలతో పాటు గిరిజన గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఏజెన్సీని సందర్శిస్తున్న పర్యాటకులను పొగ మంచు అందాలు ఆకర్షిస్తున్నప్పటికీ చలిపులితో వణుకుతునే అహ్లాదకర వాతావరణంలో సందడి చేస్తున్నారు.

అవార్డు అందుకుంటున్న విఆర్ఒ కృష్ణారావు

విఆర్ఒ కృష్ణారావుకు అవార్డు

ప్రజాశక్తి-చింతపల్లి:చింతపల్లి మేజర్ పంచాయతీ విఆర్వో సురకత్తి కృష్ణారావు గణతంత్ర దినోత్సవ వేడుకలలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. కుల, ఆదాయ ధ్రువ పత్రాలను త్వరితగతిన అందించడమే కాకుండా పివిటీజీల సర్వేను వేగవంతంగా చేయడంతో అవార్డు దక్కింతని విఆర్ఒ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉత్తమ సేవ పురస్కారం దక్కడంపై ఆనందంగా ఉందని అన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో ప్రజలకు మరింత సేవలు అందిస్తానని తెలిపారు.

పవర్ కెనాల్‌కు గండితో
నిలిచిన విద్యుదుత్పత్తి

ఇంజినీర్ల పర్యవేక్షణలో శరవేగంగా గ్రౌంటింగ్ పనులు
ఎపి జెన్‌కో ఎస్ఇ (సివిల్) ప్రశాంత్‌కుమార్

ప్రజాశక్తి -సీలేరు: డొంకరాయి పవర్ కెనాల్‌కు ప్రమాదవశాత్తు గండి పడిందని, దీనికి శరవేగంగా మరమ్మతు పనులు చేపడుతున్నట్లు సీలేరు కాంప్లెక్స్ ఎపి జెన్‌కో ఎస్ఇ (సివిల్) కెకెవి. ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి పవర్ కెనాల్ రీచ్ వన్ 2/4 వద్ద గండి పడిందని, సిబ్బంది సకాలంలో గుర్తించ డంతో పవర్ కెనాల్‌కు ముప్పు తప్పిందన్నారు. విషయాన్ని జెన్‌కో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి అనుమతులతో కెనాల్ గ్రౌటింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టామన్నారు. ఆదివారం రాత్రికి గ్రౌటింగ్ పనులు పూర్తి చేసేవిధంగా ఇంజనీర్లు పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయన్నారు. గ్రౌటింగ్ పనులకు ముందు పవర్ కెనాల్ నుంచి నీటి విడుదల నిలిపివేసి, డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని కూడా నిలుపుదల చేశామన్నారు. పవర్ కెనాల్‌కు ముమ్ముందు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా గ్రౌటింగ్ పనులను నాణ్యతతోచేపడుతున్నామని తెలిపారు. సోమవారం నుంచి డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల నుంచి విద్యుదుత్పత్తికి చర్యలు చేపడతామని వెల్లడించారు.

గండి పడిన డొంకరాయి పవర్ కెనాల్



పవర్ కెనాల్ గండి నుంచి లీకేజీ అవుతున్న నీరు

గ్రౌటింగ్ పనులు చేస్తున్న సిబ్బంది

ప్రయాణ సంకటం

- ◆ శబరి బ్రిడ్జిపై గోతుల్లో తేలిన ఇనుప ఊచలు
- ◆ ధర్మతాలగూడెం వరకు రోడ్డంతా గోతులమయం
- ◆ భయంభయంగా వాహనదారుల ప్రయాణం

శబరి వంతెనపై గోతుల్లో బయట పడిన ఊచలు

ప్రజాశక్తి- విఆర్.పురం: మండల కేంద్రం నుంచి కూనవరం వెళ్లే రహదారి శబరి బ్రిడ్జిపై అక్కడక్కడ గుంతలు ఏర్పడి, ఐరన్ ఊచలు బయటపడి ప్రమాదభరితంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గోతుల్లో వాహనాలు దిగబడితే ఇక్కడ ఊచలు గుచ్చుకుంటాయోనని ఆందోళన చెందుతున్నారు. అలాగే బ్రిడ్జి నుంచి ధర్మతాలగూడెం వరకు సుమారు అరకిలోమీటరు రహదారి నిండా గోతులమయమై వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, బ్రిడ్జిపై ఊచలు బయటపడి ప్రమాదభరితంగా ఉన్న గోతులతో సిమెంట్ కాంక్రీట్‌తో పూడ్చి, గోతులు మరింత పెద్దవై ఏకంగా వంతెనకే ప్రమాదం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే గోతులమయమైన రహదారికి కనీసం తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, తర్వాత శాశ్వతప్రాతిపదికన పునర్నిర్మాణ పనులు చేపట్టాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

ధర్మతాలగూడెం రోడ్డులో ఏర్పడిన గోతులు

బ్రొక్కోలి కొనుగోలుకు అమితాసక్తి

▸▸ వారపుసంతలో అమ్మకానికి తెచ్చిన గిరిజన మాలీలు
▸▸ కొంచెం ఎక్కువ ధర ఉన్నా, ఎగబడికొన్న ప్రజలు

సీలేరు వారపుసంతలో అమ్మకానికి తెచ్చిన బ్రొక్కోలి

ప్రజాశక్తి -సీలేరు: జికె.వీధి మండలం సీలేరు వారపుసంతలో బ్రొక్కోలి కొనుగోలుకు జనం అమితాసక్తి చూపారు. ఏజెన్సీలో సీజన్‌లో జికె.వీధి, చింతపల్లి మండలాల్లో గిరిజన మాలీలు, రైతులు సాగుచేసే కేబేజీ జాతికి చెందిన ఆకుపచ్చని బ్రొక్కోలిని సీలేరు వారపుసంతకు అమ్మకానికి తీసుకురాగా, కిలో రూ.80లు పలికి, ఇతర కూరగాయల కంటే ధర కాస్తా ఎక్కువగా ఉన్నప్పటికీ స్థానిక గిరిజన ప్రజలతోపాటు ఎపి జెన్‌కో ఉద్యోగులు కొనుగోలుకు వెనకాడలేదు.

బ్రొక్కోలిలో ఎ,సి, ఇ విటమిన్స్‌తోపాటు యాంటీ ఆక్సిడెంట్స్, పోలేడ్ విటమిన్స్ ఉండడం వలన గర్భిణుల ఆరోగ్యానికి మేలు చేస్తుందని, అలాగే బ్లడ్ సుగర్ నియంత్రణకు, జీర్ణవ్యవస్థ మెరుగుపరచడానికి, బరువు తగ్గడానికి, మెదడు పనితీరు మెరుగుపడడానికి దోహదపడుతుందని ఆరోగ్యపరంగా ఎంతో మంచిదని పలువురు చెప్పడంతో కొనుగోలుదారులు ఆసక్తి చూపారు. సీలేరు వారపుసంతలో కిలో బ్రొక్కోలి ధర వందలోపే ఉన్నప్పటికీ, మైదానప్రాంతంలోనూ దీనికి మంచి డిమాండ్ ఉండడంతో ఏజెన్సీలో పండిన వీటిని అక్కడకు తరలించి అమ్ముతుంటారు.. మైదానప్రాంతంలో కిలో బ్రొక్కోలి ధర రూ.100 నుంచి రూ.150వరకు ఉన్నప్పటికీ, అక్కడకూడా దీనికి మంచి డిఆండ్ ఉండడంతో వీటిని తరలిస్తుంటారు. వారపుసంతలోకి బ్రొక్కోలి అందుబాటులోకి రావడంపై మన్యవాసులతో పాటు ఉద్యోగులు, ఇతర కొనుగోలుదారులు సంతోషాన్ని వెలిబుచ్చారు.

మన్యంలో పర్యాటకుల సందడి

వంజంగి హిల్స్‌లో మంచు అందాలు వీక్షిస్తున్న సందర్శకులు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని అన్ని పర్యాటక ప్రాంతాల వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. వారాంతపు రోజు కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు అనేక ప్రాంతాలకు చెందిన పర్యాటకులంతా రంపచోడవరం, పాడేరు డివిజన్లలోని పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తున్నారు. అనంతగిరిలోని బొర్రా గుహలు, తైడా జంగిల్ బెల్స్, కటికి జలపాతాలతో పాటు డముకు, గాలికొండ వ్యూపాయింట్లు, సుంకరమెట్ట కాఫీ తోటలు, అరకులోయలోని పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియం, రణజిల్లెడ జలపాతం, పెదలబుడు గిరి గ్రామదర్శిని, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి, హుకుంపేటలోని మత్స్య గుండం, జెండా కొండాలోని మంచు పాడేరు మండలంలోని వంజంగి హిల్స్, డల్లాపల్లిలోని ఎత్తైన కొండలు, అందాలను పర్యాటకులు ఆస్వాదిస్తున్నారు. పాడేరు ఘాట్లోని కాఫీ తోటలు, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, చింతపల్లి ప్రాంతంలోని లంబసింగి, చెరువులవైనం, తాజంగి జలాశయం, బోటు షికారు, ఇతర పర్యాటక ప్రాంతాలను శని, ఆదివారాలు పర్యాటకులు భారీగానే సందర్శించారు. ఒకవైపు పొగమందు దట్టంగా కురుస్తుండడంతో పర్యాటకులు సందడి చేసారు. చెరువులవెనం, వంజంగి హిల్స్ ప్రాంతాల్లో పొగమంచు, ప్రకృతి అందాలను వీక్షించి సందర్శకులంతా తన్మయం చెందారు. అలాగే సీలేరు, దారకొండ, మోతుగూడెం, మారుడుమిల్లి, చింతూరు ప్రాంతాల్లోని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కళకళలాడాయి. ఈ ప్రాంతాల్లోని జలపాతాల వద్ద కూడా పర్యాటకులు సందడి చేసారు. టూరిజం రిసార్ట్స్, అతిథిగృహాలు, ప్రైవేటు లాడ్జిలు, రిసార్ట్స్‌లో పర్యాటకులు బస చేసారు. వచ్చే ఫిబ్రవరి, మార్చి నెలల వరకు జిల్లాలో పర్యాటకుల సందడి నెలకొంటుంది.

అరకులోయలో సందడి :

అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకులోయలో పర్యాటకులు సందడి చేశారు. అరకులోయ పరిసర ప్రాంతంలోని పర్యాటక సందర్శిత ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. ప్రతి ఏడాది కూడా సంక్రాంతి సెలవుల అనంతరం క్రమంగా పర్యాటకుల తాకిడి తగ్గుతూ వస్తుంది. ఈ ఏడాది వాటికి భిన్నంగా జనవరి చివరి వారంలో కూడా పర్యాటకుల సందడి తగ్గలేదు. అరకులోయలోని గిరిజన సంస్కతిక మ్యూజియం, పద్మావతి ఉద్యానవన కేంద్రం ముఖద్వారం వద్ద ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. రిపబ్లిక్ డే సెలవు రావడంతో పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరిగిందని స్థానికులు అంటున్నారు. కరోనా రావడంతో అనేక మంది పర్యాటకులు అరుకు టూర్‌ను రద్దు చేసుకున్నారు. క్రమ క్రమంగా పర్యాటకుల సంఖ్య పెరిగిందని సందర్శిత ప్రాంతాల నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు. పర్యాటకుల తాకిడి పెరగడంతో అరకు- విశాఖ రహదారిలోని వ్యూ పాయింట్, కాఫీ తోటల సందర్శిత ప్రాంతంలో పర్యాటకుల వాహనాలు రోడ్లపై నిలిపివేయడంతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ప్రయాణికులకు, పర్యాటకులకు ట్రాఫిక్‌తో ఇబ్బందులు ఏర్పడుతుండటంతో అరకులోయ పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. దీంతో ప్రయాణికులు పర్యాటకులు కొంత ఊపిరి పీల్చుకుంటున్నారు.

సందర్శకులతో కళకళలాడుతున్న పద్మావతి గార్డెన్ ముఖద్వారం

ne: 28-01-2024 16:00

నేరాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - పెదబయలు : పెదబయలు మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని వనబంగి, కిముడుపల్లి, పెద్దకోడపల్లి గ్రామాలలో సీఐ ఎస్.రమేష్ కుమార్, ఎస్సై పి.మనోజ్ కుమార్ పర్యటించారు. ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. నాటు సారా, గంజాయి సాగు వంటి నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు

ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి హుకుంపేట:-మండలం లోని భరమసి పంచాయతీ నీలంపుట్టు గ్రామనికి చెందిన ఉపాధ్యాయులు కొర్రా మహేష్ మృతి చెందారు. ఉపాధ్యాయులు కొర్రా మహేష్ అనారోగ్యంతో శనివారం మరణించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఫ్లాట్‌పాం లేక ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి-అరకులోయ : పర్యాటక కేంద్రమైన అరకులోయలోని రైల్వే రిక్వెస్ట్ స్టేజిలో ఫ్లాట్ ఫారం లేక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అరకు రైల్వే స్టేషన్ అరకులోయ నుంచి కిలోమీటర్ల దూరంలోని ఎండపల్లి వలసలో ఉండటంతో అరకు వచ్చే పర్యాటకులు ఎండపల్లి వలసలోని రైల్వే స్టేషన్ కు వెళ్లి మరల వెనక్కి అరకులోయకు రావడానికి గతంలో తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో, ప్రయాణికుల కష్టాలను రైల్వే శాఖ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన రైల్వే శాఖ ప్రయాణికుల వినతి మేరకు విశాఖ నుంచి అరకు మీదుగా వెళ్లే కిరోండోల్ ప్యాసింజర్ రైలు అరకులోయలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న రైల్వే రిక్వెస్ట్ స్టేజిలో కొద్ది నిమిషాలు ఆగడానికి చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రయాణికులు, పర్యాటకులు ఆనందపడుతున్నారు. అయితే ఈ రిక్వెస్ట్ స్టేజిలో ఫ్లాట్ ఫారం లేక పోవడంతో పాసింజర్ రైలు దిగే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు ఇటీవల రైల్వే శాఖ కొత్తవలస -కిరెండోలు రైలు మార్గంలో డబల్ లైన్ వేయడంతో పర్యాటకులకు మరింత అసౌకర్యంగా మారింది. దీంతో రైలు దిగిన ప్రయాణికులు రైల్వే ట్రాక్ దాటాలంటేనే తమ ప్రాణాలు అరచేతులో పెట్టుకుని, ఎటు నుంచి ఏ రైలు వస్తుందోనన్న భయాందోళనతో రోడ్డు దాటవలసిన పరిస్థితి నెలకొంటుంది. పిల్లలతో లగేజీలతో ప్రయాణించి ఇక్కడ దిగేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. రైలు దిగేటప్పుడు అనేకమంది ప్రయాణికులు జారి పడిపోయిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయని ప్రయాణికులు అంటున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రైల్వే రిక్వెస్టేజీలో ఫ్లాట్ ఫారం నిర్మాణానికి రైల్వే శాఖ తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, పర్యాటకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రైలు దిగి రైల్వే ట్రాక్ నుంచి నడిచి వస్తున్న ప్రయాణికులు

పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సరోజిని

పంచాయతీ నిధులతో రహదారి గోతుల పూడ్చివేత

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని జిపి.రేఖపల్లి గ్రామంలో శివగిరి రాజు ఇంటి వెనక నుంచి గొల్లగూడెం వరకు రోడ్డులోని గోతులు పూడ్చే పనులను సిపిఎంకు చెందిన స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని ఆదివారం ప్రారంభించారు. గ్రామపంచాయతీ నిధులతో ఈ పనులను చేపట్టనున్నారు. రైతులు పొలాల్లోని వెళ్లాలన్నా, మిల్లులకు ధాన్యం తీసుకెళ్లాలన్నా, ఇంకా అనేక అవసరాలకు ఆధారంగా ఉన్న ఈ రోడ్డు గుంతలు పడడంతో రైతుల, ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, పంచాయతీ నిధులతో గోతులు పూడ్చే పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ సరోజిని వెల్లడించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బెత్తి తిరపతయ్య, పట్లా మంగమ్మ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, నాయకులు పంకు సత్తిబాబు, వేటగాని సూరిబాబు. ఎన్.ప్రకాశరావు, వీర్ల నాగేశ్వరరావు, పట్లా సీతయ్య..శివగిరి, రాజుపాల్గొన్నారు..

రక్తదానంతో మేలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రక్తదానంతో ఇతరులకు ఎంతో మేలు జరుగుతుందని ది పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖ జిల్లా కన్వీనర్, సామాజిక ప్రజా వైద్యులు డాక్టర్ కుప్పిలి సురేష్ బాబు అన్నారు. విశాఖపట్నం వన్ టౌన్ ఏరియాలో ఎంవిడిఎం ప్రైమరీ స్కూలులో రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ, పెరల్ సిటీ బ్లడ్ బ్యాంక్, రోటరీ బ్లడ్ బ్యాంక్ రోటరీ క్లబ్ ఆఫ్ గీతం సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. యువకులు వారివారి ఆరోగ్య స్థితిని బట్టి ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు రతన్ కిషోర్ చౌహన్, శ్రీనిక్ జైన్, శ్రీనివాస్, రాజు, అశోక్, భాను, గ్లోరీ పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు దారుణం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఇజ్రాయిల్ పాలస్తీనాపై అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పును పాటించాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర కన్వీనర్ టి.శ్రీరామమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పాలస్తీనాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఇజ్రాయిల్ పాటించాలన్నారు. ఇప్పటికే దాడుల్లో వందలాది మంది మరణించారన్నారు. గాజా, పాలస్తీనా శరణార్థులందరికీ ఆహారం, ఇతర మందులు సరఫరా చేయవలసిందిగా ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు శ్యామల, కేంద్ర కమిటీ కన్వీనర్ మురళి, జాతీయ కమిటీ సభ్యులు చార్వాక, రషీద్, కర్రి మల్లేశం, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఉప్పులేటి నరేష్ పాల్గొన్నారు.

వైసిపి బంగాళాఖాతంలో కలవడం ఖాయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి త్వరలో బంగాళాఖాతంలో కలవడం ఖాయమని టిడిపి మాజీ మంత్రి, ప్రస్తుత ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సిఎం జగన్‌పై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భీమిలి సిద్ధం సభలో జగన్ అన్ని అబద్ధాలే మాట్లాడారని మండిపడ్డారు. ఆదివారం విశాఖలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గంటా మాట్లాడుతూ తనకు తాను అర్జునుడిగా జగన్ చెప్పుకుంటున్నారని తెలిపారు. ఆ వ్యాఖ్యలపై జనం నవ్వుకుంటున్నారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటమి తప్పదని అన్నారు. పులివెందులలోనూ జగన్ ఓడిపోనున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో జగన్ నవరత్నాలతో కలిపి 730 హామీలు ఇచ్చారని. 15 శాతం హామీలే అమలు చేశారని తెలిపారు. ఆయన పాలనంతా విధ్వంసం, ప్రత్యర్థులపై అణిచివేతలతోనే సాగిందన్నారు.

ప్రజలెలా పోతేనేం ?

- రసాయనిక వ్యర్థాల నిల్వకు రాంకీకి 50 ఎకరాలు కేటాయింపు
- నిబంధనలు పాటించని సదరు సంస్థ
- అయినా అనుమతులిస్తున్న ప్రభుత్వం
- తాడి తరలింపు విస్మరణ
- పెరగనున్న కాలుష్యం
- రేపు ల్యాండ్ ఫిల్‌కు ప్రజాభిప్రాయ సేకరణ
సర్వత్రా అభ్యంతరాలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ డెవలపర్ రాంకీకి ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) మరో 50 ఎకరాలు కేటాయించింది. కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టడం లేదని, శుద్ధి చేయకుండా వ్యర్థ రసాయనాలు సముద్రంలోకి విడిచిపెడుతోందని, గ్రీన్‌బెల్ట్ స్థలాన్ని విక్రయించి సొమ్ము చేసుకుందని పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాంకీకి ప్రమాదకర వ్యర్థాల శుద్ధి నిల్వ (ల్యాండ్ ఫిల్)కు ఎపిఐఐసి 2022 జూన్ 17న మరో 50 ఎకరాలు కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. దాదాపు రూ.200 కోట్ల వ్యయంతో పరవాడ మండలం తాడిలో సర్వే నెంబర్ 116 పార్ట్‌లో ల్యాండ్‌ఫిల్ ఏర్పాటుకు రాంకీ సిద్ధమవుతోంది. ల్యాండ్‌ఫిల్ కోసం పరవాడ తహశీల్దార్ కార్యాలయం సమీపంలో కాలుష్య నియంత్రణ మండలి మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనుంది. కాలుష్య నిబంధనలు పాటించని రాంకీకి మరో ల్యాండ్‌ఫిల్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతివ్వడంతో తాడి, తానాం, పరిసర ప్రాంతాలు మరింత కాలుష్యం బారినపడనున్నాయి. ఇప్పటికే ఆయాచోట్ల తాగునీరు కలుషితమైంది. ఈ ప్రాంత ప్రజలు అనారోగ్యంపాలవుతున్నారు. అయినా వారి బాగోగులు విస్మరించి, రాంకీకి ప్రభుత్వం సహాయపడుతోంది.

తాడి ప్రజలకు న్యాయమైన పరిహారం చెల్లించి, సురక్షిత ప్రాంతానికి తరలించాల్సిన ప్రభుత్వం హామీలతో కాలం నెట్టుకొస్తోంది ఫార్మా కాలుష్య బాధిత తాడి, చినతాడి, బిసి కాలనీ ప్రజలు ఎన్నో ఏళ్లుగా పరిహారం చెల్లించి సురక్షిత ప్రాంతానికి తరలించాలని పోరాడుతున్నారు. అయినా సంతృప్తికరమైన పరిహారం చెల్లించి పెదముషిడివాడకు తరలించడానికి ప్రభుత్వం ముందుకురావడంలేదు. తాజాగా సర్వే చేసి మేజర్ కుమారులు, కుమార్తెలను గుర్తించడానికి ప్రభుత్వం నిరాకరిస్తోంది. రూ.56 కోట్లు విడుదలచేసి తాడి ప్రజలకు న్యాయం చేస్తామని 2022 ఏప్రిల్ 28న సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలుకాలేదు. 2019 ఫిబ్రవరి 6న టిడిపి ప్రభుత్వం రూ.57.63 కోట్లు విడుదల చేస్తున్నట్లు జారీ చేసిన జిఓ 29 కార్యరూపందాల్చలేదు. ప్రతిరోజూ కాలుష్యంతో అనేక అవస్థలు పడుతున్న తాడి, చినతాడి, బిసి కాలనీ ప్రజలను పట్టించుకోని ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించి కోట్ల రూపాయలు సంపాదిస్తున్న రాంకీకి మాత్రం అన్ని విధాలా తోడ్పడుతోంది. తాడిని తరలించకుండా రాంకీకి ల్యాండ్‌ఫిల్‌కు అనుమతివ్వడంపై ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

రసాయనిక వ్యర్థాలు నిల్వ చేయనున్న ప్రాంతమిదే..

రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించిన రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి. ల్యాండ్ ఫిల్‌కు కేటాయించిన భూమిని వెనక్కు తీసుకోవాలి. గ్రీన్ బెల్ట్ లేకుండా ఆ సంస్థ స్థలాలను విక్రయించింది. రసాయన పరిశ్రమల వ్యర్థాల డంపింగ్ యార్డుగా ఈ ప్రాంతాన్ని తయారు చేస్తోంది. పర్యావరణ నిబంధనలు పాటించని రాంకీ కారణంగా ఈ ప్రాంత ప్రజలు తీవ్రమైన కాలుష్య సమస్యలతో బాధపడి అనారోగ్యంపాలవుతున్నారు. ల్యాండ్‌ఫిల్‌కు కేటాయించిన భూమిని వెనక్కు తీసుకొని, 30న జరిగే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలి.

కె.లోకనాథం, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి

క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు

మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి - సీలేరు : క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలను అందిపుచ్చుకోవచ్చని, అందుకు తామే నిదర్శమని సీలేరు ఎపి గురుకులం పూర్వ విద్యార్థి ఇవివి. సత్యనారాయణ అన్నారు. ఆదివారం సీలేరు ఎపి గురుకులం పూర్వ విద్యార్థులు పి. సుందరరావు, ఇవివి. సత్యనారాయణ, ఎపి జెన్‌కో సీనియర్ అకౌంటు ఆఫీసర్ ఎల్. వేణుకుమార్, ఎన్ఆర్ఐ బి. రమేష్, పి. రమణరాజు, ఎం.రమణ బృందం పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా తాము ఇదే పాఠశాలలో పదో తరగతి చదువుకున్న రోజులనాటి పాతజ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడుతూ,తాము చదువుకునే రోజుల్లో సీలేరు గురుకులంలో ఇప్పుడున్నంత సౌకర్యాలు లేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు పలు విద్యాపథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పథకాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నతంగా చదివి, భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఎక్స్‌సర్వీస్ మ్యాన్‌పై హత్యాయత్నం

ప్రజాశక్తి -ములగాడ : ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీలో నివాసముంటున్న ఆర్.శంకరరావుపై చల్లా కృష్ణ హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మల్కాపురం పోలీసుల కథనం ప్రకారం... జివిఎంసి 59వ వార్డు పరిధి ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ ప్రాంతంలో నివాసముంటున్న ఆర్.శంకరరావు అదే ప్రాంతంలో 200 గజాన్ని స్థలాన్ని గతంలో కొనుగోలు చేశారు. అదే స్థలంలో తనకు 50 గజాల స్థలం ఉందని శంకర్రావుకు చల్లా కృష్ణ తెలిపాడు. శంకరరావు ఊర్లో లేని సమయంలో ఆ స్థలంలో చల్లా కృష్ణ రేకుల షెడ్డు వేశాడు. శంకరరావు వచ్చాక షెడ్డును చూసి కృష్ణను ప్రశ్నించాడు. దీంతో శంకరరావుపై చల్లా కృష్ణ కత్తితో దాడికి దిగి హత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ మేరకు శంకరరావు మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి ఇరువురిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. కేసును మల్కాపురం సిఐ సన్యాసినాయుడు విచారణ జరుపుతున్నారు.

గృహోపకరణాలు దగ్ధం

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం కొత్తకోటలో శనివారం అర్ధ రాత్రి జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగసి ఇంటిలోని గృహోపకరణ వస్తువులు కాలి బూడిద అయ్యాయి. బాధితుల కథనం మేరకు...గ్రామానికి చెందిన మారోజు నానాజీ కుటుంబం స్థానిక మెయిన్ రోడ్డుకి సమీపంలో గత కొన్నాళ్లుగా అద్దెకు ఉంటున్నారు. శనివారం అర్ధరాత్రి విద్యుత్ బోర్డులో నుంచి షార్ట్ సర్క్యూట్ అయి లోపల ఉన్న ఫ్రిడ్జ్, టీవీ, ఫ్యాన్ వంటి ఎలక్ట్రికల్ సామాన్లు, దుస్తులు కాలి బూడిద అయ్యాయి. సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం సంభవించింది. గ్రామంలో చిన్న చిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న వీరికి అనుకొని పరిస్థితుల్లో ప్రమాదం జరగడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

సారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట: మండలంలోని నిలకంఠాపురం గ్రామ శివారులో నాటు సారా తయారి కోసం సిద్ధం చేసిన పులుపును ధ్వంసం చేశామని బుచ్చయ్యపేట ఎస్సై డి.ఈశ్వరరావు తెలిపారు. తన సిబ్బందితో ఆదివారం వెళ్లి మూడు ప్లాస్టిక్ డ్రమ్ములతో ఉన్న 500 లీటర్ల నాటు సారా పులుపును స్వాధీనం చేసుకుని వాటిని ధ్వంసం చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

30న భారత్, ఇంగ్లండ్ క్రికెటర్లు రాక

- 2 నుంచి టెస్టు మ్యాచ్‌కు పటిష్ట ఏర్పాట్లు

పనులను పరిశీలించిన ఎసిఎ కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి

ప్రజాశక్తి -పిఎం పాలెం : భారత్ - ఇంగ్లాండ్ రెండో టెస్టు మ్యాచ్‌కు విశాఖపట్నంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదిక కానున్న నేపథ్యంలో ఇప్పటికే ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డి తెలిపారు. వచ్చే నెల 2 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న టెస్టు మ్యాచ్‌లో భాగంగా భారత్, ఇంగ్లాండ్ జట్ల ఆటగాళ్లు హైదరాబాద్ నుంచి విమానంలో ఈ నెల 30న మధ్యాహ్నం 2.10 గంటలకు బయలుదేరి 3.25 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారని చెప్పారు. వారి వెంట మ్యాచ్ అధికారులు, ఇతర సిబ్బంది రానున్నట్లు తెలిపారు. మ్యాచ్ నిర్వహణలో భాగంగా స్థానిక స్టేడియంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఎసిఎ ట్రెజరర్ ఎవి.చలంతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. స్టేడియం లోపల, బయట చేపడుతున్న పనులను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేడియం పరిసర ప్రాంతాల్లో పోలీసుల సమన్వయంతో అవసరమైన భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వాహనాల పార్కింగ్ వద్ద తగిన సిబ్బందిని నియమించి ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. రోజుకు 2 వేల మంది చొప్పున 5 రోజులకు 10 వేల మంది విద్యార్థులకు ఉచిత ఎంట్రీ ఇవ్వనున్న దృష్ట్యా వారి ఐడీ కార్డులను పరిశీలించి స్టేడియంలోకి పంపాలన్నారు. రోజుకు 2,850 మంది చొప్పున 5 రోజులకు 14,250 మంది రాష్ట్రంలో ఉన్న క్లబ్ క్రీడా కారులకు ఉచిత ఎంట్రీ ఇవ్వనున్నట్లు ఎసిఎ కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి తెలిపారు.

పంచ గ్రామాల దే
వుడా 'భూ' సమస్య
పరిష్కరిం
పంచ గ్రామాల భూసమస
వేపగుంట
Let's fight together! Let us protect our lands!
Let's fight tirelessly To achieve our goal

పాదయాత్ర నిర్వహిస్తున్న యువతీ యువకులు, స్థానికులు

పంచ గ్రామాల భూ సమస్యపై పాదయాత్ర

ప్రజాశక్తి - వేపగుంట, పెందుర్తి

సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరించుకునేందుకు స్థానిక యువత నడుం బిగించారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ సమస్య ఎప్పటికీ పరిష్కారం కావడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆదివారం నాయుడుతోట నుంచి వేపగుంట వరకూ పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా పంచగ్రామాలకు చెందిన అందరూ పాల్గొన్నారు. పంచ గ్రామాల భూ సమస్యతో పాటు సుమారు 120 ఎకరాలకుపైగా వుడా భూ సమస్య కూడా ఉందని, దీన్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంచ గ్రామాల సమస్యపై సోమవారం నుంచి ఇంటింటి ప్రచారం చేపడతామన్నారు. ఇప్పటికే కరపత్రాల ద్వారా సమస్య తీవ్రతను అందరికీ తెలియజేశామన్నారు. పెద్ద ఎత్తున పోరాటం చేసి తమ భవిష్యత్తుకు తామే పునాదులు వేసుకుంటామన్నారు. తమకు భూములు ఉండి కూడా పాలకుల తీరుతో కష్టాలతో బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమైక్య రైతు ప్రజా సంక్షేమ సంఘం కార్యదర్శి టివి.కృష్ణంరాజు మాట్లాడుతూ సుమారు 25 సంవత్సరాల నుంచి పంచ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిల్‌మెన్ సర్వే ప్రకారం బాధితులకు న్యాయం చేయాలన్నారు. బల్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యమానికి యువత శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. లక్షా 30 వేల మంది భూ సమస్య వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పార్టీలు మారుతున్నాయే తప్ప సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. పంచ గ్రామాల భూ సమస్య పోరాట కమిటీ ఆధ్వర్యాన జరిగిన ఈ పాదయాత్రలో అధిక సంఖ్యలో దేవస్థానం భూ బాధితులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పట్ల డిపిటిఒ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కార్మికుల సమస్యల పట్ల ఆర్‌టిసి విశాఖ డిపిటిఒ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఎపి పిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పివివి.మోహన్ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 11వ రోజుకు చేరాయి. శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ కావాలని పోలీసులకు తప్పుడు సమాచారం ఇచ్చి ప్రభుత్వ వ్యతిరేకులు అని చిత్రీకరించారని తెలిపారు. ఈ క్రమంలోనే కార్మికులను శనివారం అరెస్టులు చేశారన్నారు. వాస్తవానికి తమ ఆర్‌టిసి కార్మికులకు ప్రభుత్వం ప్రతి నెలా టైంకి జీతాలు ఇస్తూ అన్ని సౌలభ్యాలు కల్పిస్తుంటే, అవి కార్మికులకు అందకుండా విశాఖ ఆర్ఎం వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు డిపిటిఒ వైఖరిపై ఉద్యమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జోనల్ ప్రెసిడెంట్ వి.ప్రదీప్ కుమార్, రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు గండి రామకృష్ణ, బి.నీలకంఠం, విజయనగరం రీజనల్ కార్యదర్శి రాములు, డివిజన్ కార్యదర్శి ఎకె.శివాజీ, డివిజన్ ప్రెసిడెంట్ విఎస్‌అర్.మూర్తి, గాజువాక కార్యదర్శి పి.శంకరరావు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 1032వ రోజుకు చేరాయి. దీక్షల్లో డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సంతోష్ కుమార్, నాయకులు శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. భారత నాస్తిక సమాజం నాయకులు టి.శ్రీరామమూర్తి, శ్యామల, మురళి, విజ్ఞానంద్ తదితరులు శిబిరం వద్దకు వచ్చి మద్దతు తెలిపారు.